# ఆకాశవాణి - వ్యాఖ్యాన కథ

కె. వంగూరి చిట్టెన్ రాజు



ముప్పయి ఏళ్ల క్రితం. ఈ నెలకి, కాంతమ్మగారు ఆరో నెల గర్భవతి. ఒక రోజు పరమేశ్వరుడు ఆవిడ కలలోకి వచ్చి, "కాంతమ్మా! నీకు పుట్టబోయే అమ్మాయికి 'వాణి' అనిపేరు పెట్టు!" అని ఆదేశించాడు.

"అదేవిటీ ఈశ్వరుడుగారూ! మీ ఆవిడ పార్వతి పేరు పెట్టమని చెప్పాలి గానీ, బ్రహ్మదేవుడి పెళ్లాం పేరు పెట్టమంటారేమిటి, అఁవటా!" అని పక్కనే పడుకున్న కాంతమ్మ మొగుడు, సుబ్బారాయుడు గారు తన ప్లీడరీ పద్ధతిలో అడిగాడు.

"అసలు, ఆ మాటకొస్తే మాకు అమ్మాయే పుడుతుందన్న గ్యారంటీ ఏమిటీ?" అని ఇంకా ఏదో అనబోతుండగా పరమేశ్వరుడు కోపంగా "నువ్వుండవయ్యా! నేను నీ కలలోకి కాదు గదా వచ్చింది, మీ ఆవిడతో మాట్లాడుతూంటే మధ్య నీ గోల ఏమిటీ?" అని కసిరాడు.

"అదేమిటి సార్, మీరు అర్ధనారీశ్వరులు కదా, మా ఆవిడ కలలోకి వస్తే, సగం నా కలలోకి కూడా వచ్చినట్టే కదా!" అని ఆర్గ్యూ చేయబోతుంటే కాంతమ్మ, సుబ్బారాయుడు నోరు నొక్కేసి, పరమేశ్వరుడితో, "మానవ మాత్రులం, మేం ఎవ్వరం అడ్డుపెట్టడానికి?" అని ఒప్పేసుకుంది. అయినా మనసు తీరిక, "పరమేశ్వరా! మాకు అమ్మాయి పుడితే 'వీరవెంకట సత్య కామేశ్వర గజలక్ష్మి' అనే పేరు పెడదాం అనుకున్నాం. పోనీలెండి, అది రెండో అమ్మాయికి పెట్టుకుంటాం గానీ, ఈ పిల్లకి 'వాణి' అని పేరు పెట్టమని ఆదేశించడంలో అంతరార్థం ఏమిటి?" అని మర్యాదగా, మొగుడి నోటి మీదనుంచి చెయ్యి తియ్యకుండా అడిగింది కాంతమ్మగారు.

ఈశ్వరుడు ఒక నవ్వు నవ్వి "కాంతమ్మా! మీ అమ్మాయి కారణజన్మురాలు. తను పెద్దదయి, పెళ్లయ్యాక, విష్ణుఖండంలో, మ్లేచ్ఛద్వీపంలో, హ్యూస్టన్ అనే మహానగరంలో నివసించబోతోంది. ఆ నగరంలో ఆమె ప్రజావాణిగా, వార్తల సేకరణ, వార్తల ప్రసారం, గాలి నుంచి వార్తలు తయారుచేయడం, కనపడని, వినపడని విశేషాలు ఊహించి ప్రచారం చేయడం వగైరా టెలికమ్యూనికేషన్ విద్యల్లో ఆరితేరి, ప్రవాసాంధ్ర ప్రజానీకానికి సేవచేయబోతోంది. తన ప్రజ్ఞ ద్వారా 'ఆకాశవాణి' అని పేరు పొందుతుంది. అందుచేత నీ విందాక చెప్పిన ఎ.బి.సి.డి. గజలక్ష్మి బదులు 'వాణి' అనే పేరు పెడితే, సరిగ్గా అతికినట్టుంటుంది అని మొన్న దుర్భిణీ చూస్తూ పార్వతీ దేవి అంటే, ఆ మాట నీకు చెప్పాలనే వచ్చాను!" అని ఈశ్వరుడు కాంతమ్మగారికి బోధపరిచాడు.


మాట్లాడటానికి వీలుకాని పరిస్థితిలో, పెళ్లాం చేతిలో కుస్తీ పడుతున్న అటార్నీ జనరల్ సుబ్బారాయుడుకేసి కన్నుగొట్టి, ఈశ్వరుడు ఇంకొకరి కలలోకి మాయమైపోయాడు.

కిందటి నెల, కాంతమ్మగారూ, సుబ్బారాయుడుగారూ, అమెరికా అల్లుడినీ, అమ్మాయి సంసారాన్నీ ప్రత్యక్షంగా చూద్దామని హ్యూస్టన్ వచ్చినప్పుడు పై సంగతంతా స్పష్టంగా జ్ఞాపకం వచ్చింది వాళ్లకి.

ఆకాశవాణీ, హ్యూస్టన్ కేంద్రం ప్రసారం శనివారం ప్రొద్దున 9 గంటలనుంచి ఆదివారం రాత్రి పది గంటలవరకూ నిరాఘాటంగా సాగుతుంది. మిగతా రోజులలో ప్రత్యేక ప్రసారాలు జరుగుతాయి. నాకు మొదట్లో కొంచెం అనుమానం ఉండేది గానీ, మొన్న ఈ మధ్య జరిగిన విశేషంలో ఆకాశవాణి వార్తల సేకరణ టెక్నిక్. సాధారణ అభిప్రాయాలలో అంతరార్థాలు వెదికి, కథగా తయారుచేసి, టెలిఫోన్ నాటికలు ప్రసారం చేయడం మొదలైనవి స్పష్టంగా అర్థమయ్యాయి.

శివరాం అనుకోకుండా ఇండియా వెళ్లాడు. వాడు ఎందుకు వెళ్లాడో వాడి పెళ్లానికీ, నాకూ తప్ప ఇంకెవ్వరికీ తెలియదు ... తెలీదు అనుకుని భ్రమపడ్డాను. వాడు వెళ్లిన రెండ్రోజులకి ఆకాశవాణి ప్రసారం ప్రారంభమయింది. మొదటి శ్రోత సుశీల, ఆదివారం పొద్దున్న ముసుగుతన్ని పడుకుంటే ఫోను మోగింది.

"అవునూ, ఈమధ్య నీతో మాట్లాడలేదు. ఎలా ఉన్నావో?" వాణీ గొంతు.




"అదేమిటీ, మొన్ననేగా మీ ఇంటికి వచ్చింది!" అంది సుశీల.

"అవుననుకో, అందరూ ఉన్నారుగా! మాట్లాడటానికి కుదరలేదు, అందుకనీ ... ఇంతకీ ఏమిటి విశేషాలు?"

"ప్రస్తుతానికి నిద్దరొస్తోంది, వాణీ! నిన్న రాత్రి ఇంటికొచ్చేసరికి లేటయింది!" ఆవలిస్తోంది సుశీల.

"అవున్లే, దుర్గా వాళ్లిల్లు దూరం కదా! ఒక్కర్తివీ ఎలా వచ్చావు? శివరాం ఇండియా వెళ్లాట్ట కదా?"

"అదెవరు చెప్పారు నీకు, కొంపతీసి రాజుగానీ చెప్పాడా?"

"అదిగో, చూశావా, రాజుకి తెలుసన్నమాట! మాటవరసకైనా చెప్పాడు కాదు!"

"అయితే నీ కెలా తెలుసూ?"

"ఇలాంటివి ఎవరైనా చెప్పాలేమిటి సుశీలా? ఆఫీసు పనిమీద ఏ ఊరైనా వెడితే వీకెండ్‌కు వచ్చేస్తారు కదా! శివరాం వీకెండ్‌లో లేడూ అంటే ఇండియా వెళ్లాడేమోననీ ..."

"వాణీ! నీ తెలివితేటలు బాగానే ఉన్నాయి గానీ, ఆ మాట ఇంకెవరికీ చెప్పకేం..!" దుర్గ చెప్పి ఉంటుందని సుశీల అనుమానం. రాజు చెప్పడని కూడా సుశీల అభిప్రాయం.

"ఎవరికైనా చెప్పడానికి నాకేం ఖర్మ! నేనేమైనా ఆలిండియా రేడియోనా!? ఇంతకీ అంత రహస్యంగా శివరాం ఇండియా ఎందుకు వెళ్లినట్టూ? ఎవరికైనా చెప్తే మా వాళ్లకిది పట్టుకెళ్లూ, మాకు వక్కపొడి పట్టుకురా అని చావగొడతారనా....! ఇంతకీ ఎప్పుడు తిరిగి వస్తాడూ?" అనడిగింది వాణి.

"సరేలే, శివరాం సంగతి తెలియంది ఏముంది, సరిగ్గా రెండు వారాల్లో వస్తానని వెళ్లాడు. నెల దాటాక వస్తే గొప్ప!"

"బాగా చెప్పావు! ఈ మగాళ్లంతా ఇంతే! మా ఆయన మరీ అన్యాయం...! నాలుగు వారాల్లో వస్తానని, గట్టిగా పదిరోజులైనా అవకుండానె వెనక్కి వచ్చేశారు పెద్ద కొంప మునిగినట్లు. సర్లే, శివరాం వచ్చేలోగా ఏమన్నా కావలసివస్తే మొహమాట పడకుండా పిలు! ఎంతయినా ఒక ప్రాంతం వాళ్లం కదా!" అని ఫోను పెట్టేసింది వాణి. వాణిది కాకినాడ. సుశీలది గుడివాడ. ప్రసారంలో మొదటి వార్త "శివరాం ఆంధ్రా వెళ్లాడు" అని కన్‌ఫర్మ్ అయింది.

శుభ్రమైన నిద్రలోంచి లేపింది అని తిట్టుకుంటూ సుశీల లేచి కాలకృత్యాలు తీర్చుకుని, శివరాం ఇండియా వెళ్లిన పని అవుతుందో లేదో అని ఆలోచిస్తూండగా మళ్లీ ఫోను.

"ఏం సుశీలా, బాగున్నావా? నేనూ

శ్యామలని." శ్యామల ఆకాశవాణి ప్రత్యేక విలేఖరి. పైగా రిలే కేంద్రం.

"మీ ఆయన ఇండియా వెళ్లాట్టగా! ఏమిటీ విశేషం?"

"ఎవరు చెప్పారు? రాజు గాని చెప్పాడా?"

"అయితే రాజుకి తెలుసన్నమాట!"

"అంటే వాణి చెప్పిందా?"

"అబ్బే, వాణికి మటుకేం తెలుసు? ఇందాక పిచ్చాపాటీ వేస్తుంటే అనుకున్నాం, అంతే! ఇంతకీ నువ్వు వెళ్లలేదేం, పెళ్లికి!"

"పెళ్లా, ఎవరిది?"

"శివరాం చెల్లెలి పెళ్లట కదా!"

"ఇదెవరు చెప్పారు?" సుశీలకి కోపం, ఉక్రోషం వచ్చాయి.

"ఎవరో చెప్పడం ఏమిటి, వాణితో ఆమధ్య నువ్వే అన్నావు శివరాం చెల్లెలికి అమెరికా సంబంధం చూస్తున్నారని!"

"చూస్తున్నామని చెప్పాము గానీ, అప్పుడే సంబంధం కుదిరిపోయి పెళ్లి అయిపోతోందని ఎలా అనుకున్నారు శ్యామలా!" సుశీలకి చికాకు వేస్తోంది. విషయం కనిపెట్టేశారే అని కొంచెం కోపం కూడా వచ్చింది.

"సరేలే, ఇంతకీ బంగారం ధర తగ్గిపోయింది కదా, ఒక నాలుగుగాజులు కొంటున్నావా?" టాపిక్ అర్జంటుగా మార్చేసింది శ్యామల, సుశీల గొంతుకలో చికాకు కనిపెట్టి.

ఈపాటికి శివరాం నెల్లూరు వెళ్లి ఉంటాడు. కిందటి వారం ఇచ్చిన కేబుల్ అందిందో లేదో శ్రీనివాసరావుగారికి. శివరాం నాన్నగారు కూడా గుడివాడ నుంచి డైరెక్ట్‌గా ఉత్తరం రాసి ఉంటారులే. ఈ సంబంధం కుదిరిపోతే బాగుండును. శివరాం బాధ్యతలన్నీ తీరిపోతాయి. పెళ్లంటూ అయ్యాక వాళ్లు ఇక్కడికి రావడానికి నాలుగైదేళ్లు పడుతుంది కదా! అదయినా అతనికి ఇష్టం ఉంటేనూ. రాజుకి మాత్రం ఎంత తెలుస్తుంది ఇలాంటి విషయాల్లో అని ఏవో ఆలోచనల్లో, మరో పక్క తిట్టుకుంటూ బాత్రూమ్ క్లీన్ చేస్తూంటే మళ్లీ ఫోన్ మోగింది.

"హల్లో, నేను వాణిని. కంగ్రాట్యులేషన్స్! మీ ఆడపడుచు పెళ్లట కదా వచ్చేవారం. ఇందాక మాట్లాడినప్పుడు మాట మాత్రం అనలేదేం?"

"ఆలూ లేదూ, చూలూ లేదు. కొడుకు పేరు సోమలింగంట! ఇంకా సంబంధం కుదరలేదు .... ఏమీ లేదు ..." సుశీల గొంతుక ఉక్రోషం దాచలేకపోయింది.

"నువ్వు మరీనూ, సంబంధం కుదరకపోతే, ఇండియా ఎందుకు వెడతాడూ? మొన్ననేగా శివరాం సిటిజన్‌షిప్ కూడా తీసుకున్నాడు. స్పాన్సర్ చేస్తాడన్నమాట కొత్త బావగారిని ...." వాణి ఇంకా ఏదో అనబోతోంది.

"సర్లే, వాణీ! కాంత్‌గాడు నిద్ర లేచినట్లున్నాడు. మళ్లీ మాట్లాడుకుందాం!" అని టక్కున పెట్టేసింది సుశీల. ఎనిమిదేళ్ల కాంత్ నిద్ర లేచి, పక్కింటి డేవిడ్‌తో ఆడుకోడానికి వెళ్లి గంటయింది.

నేను అప్పుడే స్నానం చేసి, కాఫీ మైక్రోవేవ్‌లో పెడుతూండగా మామగారు 'గుమ్మడి'లాగా మొహం పెట్టి, "అబ్బాయి, రాజా! నీతో ఒక ముఖ్య విషయం చెప్పాలయ్యా!" అన్నారు.

మా అత్తగారికి, మామగారికి ఇక్కడికి వచ్చిన వారం రోజుల్లో నా సంగతి తెలిసిపోయి, 'కావడానికి నువ్వు అమెరికా అల్లుడివేగానీ, ఉత్తి సన్నాసివయ్యా!' అని చెప్పదలుచుకున్నారేమో అని నేను అనుకుంటూంటే ...

"అవున్నాయనా, ముప్ఫయి ఏళ్ల క్రితం, ఈ నెలకి మీ అత్తగారు ఆరో నెల గర్భవతి. ఒకరోజు పరమేశ్వరుడు ఆవిడ కలలోకి వచ్చి ...." అని ఇంకా ఏదో మామగారు అంటూండగా.

"ఏమండీ మీకేమన్నా బుద్ధి ఉందా ...! శివరాం ఇండియా వెళ్లాడని మీకు తెలిసి కూడా నాతో ..." అంటూ వాణి రేడియో కేంద్రం, అంటే మా మాస్టర్ బెడ్రూమ్ నుంచి యుద్ధానికి సిద్ధమైంది.

నేను అర్జంటుగా నా కాఫీ పట్టుకుని ప్రపంచంలో ఉన్న ఒకే ఒక్క చోటు, అదే మా బాత్రూమ్‌లోకి పరుగెట్టాను. నెల్లూరు శ్రీనివాసరావు కొడుకూ, నేనూ చిన్నప్పట్నుంచీ కలిసి చదువుకున్నాం. వాడు డాక్టరు నేను ఆకాశవాణి మొగుణ్ణి.

■

## ప్రేమ తెచ్చిన మార్పు!

ఇంతకు ముందు అజిత్ చేతిలో ఎప్పుడూ సిగరెట్ కనిపించేది. ముందు వెనుకా ఏమీ ఆలోచించకుండా దురుసుగా మాట్లాడేవాడు. వీటన్నింటికీ అజిత్ ఇప్పుడు ఫుల్‌స్టాప్ పెట్టేశాడు. దీని క్కారణం ప్రస్తుతం ఈయన షాలిని ప్రేమలో నిండా మునిగిపోవడమే అని ఆయన సన్నిహితులంటున్నారు. అంతేకాదు. షూటింగ్‌కి బయలుదేరే ముందు శివాజీ గణేషన్‌లా అద్దం ముందు అరగంట పాటు నిలబడి ఆరోజు తాను చేయబోయే సన్నివేశాలను ప్రాక్టీస్ చేస్తున్నాడట. అజిత్, షాలిని పెళ్లి వచ్చే జనవరిలో జరుగుతుంది. పెళ్లయ్యాక షాలిని సినిమాల్లో నటించదని అజిత్ స్పష్టం చేశాడు.

వి.

